# 1

# మంచు పల్లకి

సాయంత్రమయింది. అన్ని దిక్కులనుంచీ ఇల్లు చేరుకుంటున్నది చీకటి. బుల్లబ్బాయి రెండుచేతులూ ఎత్తి పిరిగ్గా నమస్కరించి అతి దీనంగా అక్కడున్న ఐదుగురు టీచర్ల మొహాల్లోకీ చూసి నుంచొన్నాడు.

బస్ కోసం ఎదురుచూస్తున్నారు టీచర్లు. దగ్గర సంతనించి వచ్చిన వర్తకులు బస్‌స్టాండ్ దగ్గర తమ సరంజామాతో నిరీక్షిస్తున్నారు. దగ్గర్లో వున్న చెరువు నీరు పొలాల్లోకి పోయే కాలవ వంతెన గట్టుమీద కొందరు కూచున్నారు.

"బస్‌కోసమా?"

"అవునండీ!"

ఇంకా పదకొండేళ్ళు నిండలేదు.

గొంతు పసిగావుంది.

అక్కడున్న టీచర్లు తలో ప్రశ్న వేశారు. ఎక్కడికి వెడుతున్నావు, ఏమిటి పని మొదలయినవి.

బుల్లబ్బాయి తల్లి ఆరోగ్యం బాగలేక చాలాదినాలు ఆమెని వూర్లోనే ఉంచి ఆయుర్వేద వైద్యమూ, ఎల్. ఎమ్. పి. డాక్టరుతో అల్లోపతి వైద్యమూ చేయించి ఏ ఫలితమూ, ఏమాత్రము మెరుగూ కనిపించకపోవటంతో దగ్గర్లోవున్న పట్టణంలోని ఎమ్. బి., బి. యస్. డాక్టరువద్దకు తీసుకుపోయారు. తండ్రి హాస్పిటల్‌లోనే వుంటు

న్నాడు. తండ్రికోసం ఉదయం, సాయంత్రం అన్నం కారియర్ బస్‌కి అందిస్తున్నాడు.

ఇప్పుడు వచ్చే బస్సులో ఖాళీ కారియర్ వస్తుంది. ఒక్క పరుగున ఫర్లాంగున్నర దూరంలోవున్న వూరికిపోయి కారియర్ కడిగి అక్కయ్య సర్దేక మళ్ళీ తొందరగా బస్‌స్టాండ్‌కి వచ్చి నైట్ హాల్ట్ పట్నానికిపోయే బస్సుకి అందిస్తాడు.

టీచర్లు వేసిన ప్రశ్నలకీ, సందేహాలకీ జవాబులు చెప్పి నేలకి చూపులు వాల్చి నుంచున్నాడు. వాడి మనసులో సమాధానం తెలియని ప్రశ్నలు దట్టంగా నిండివున్నాయి. అమ్మ ఎప్పుడు వస్తుంది? నాన్న ఇంటిపనులూ, షాప్ పనులూ ఎప్పుడు చూసుకుంటాడు? తను బడికి రోజూ వెళ్ళటం ఎప్పుడు? ఈ బస్సులకోసం ఉదయం సాయంత్రం వేచివుండటం ఎప్పుడు తప్పుతుంది? అమ్మ వచ్చి ఇంటిపనులన్నీ తనే ఎప్పుడు చూసుకుంటుంది? సాయంకాలప్పూట అందరితోపాటు ఆడుకోటానికి అవకాశం ఎప్పుడు చిక్కుతుంది? బడికి రాకపో తున్నందుకు టీచర్లు కోప్పడుతున్నారనీ, ఫ్రెండ్స్ అంతా విచారి స్తున్నారనీ అమ్మతో ఎప్పుడు చెప్పడం—మొదలయినవన్నీ టీచర్లు వేసిన ప్రశ్నలతో కదిలినట్టున్నాయి.

చుట్టూవున్న పొలాలు నిన్న మొన్నటివరకూ బంగారం లాంటి పంటతో కలకల్లాడాయి. ఈ సాయంత్రానికి అన్నీ నిర్జీవంగా వున్నాయి. నిన్న మొన్నటివరకూ ఆ బంగారు పంట శ్రావ్యంగా గొంతువిప్పి పాడింది. ఈనాడు మూగవోయింది. సూర్యుని చివరి వెలుగు తీయని జ్ఞాపకంలాగ పశ్చిమ ఆకాశానికి ఊదారంగుతో అతు క్కునే వుంది. అరమైలుదూరంలో తూర్పున కొబ్బరితోటలు మార్గ శిరపు చలిగాలులకు జడిసి భయంకరమైన భవిష్యత్తు కంబళీని కప్పు కున్నాయి. ఆకాశం మరీ అందంగా పంచమివెన్నెల తెరలని నేల మీదికి జారుస్తోంది. చీకటి కౌమారంలో వుంది. అందాన్ని-ఆ సాయంత్రం ముత్యాన్ని కడిగినట్టుగా కడుగుతోంది.

మఫ్లర్ చుట్టుకున్న పొడుగాటి టీచర్ కొంతసేపు అదేపనిగా

బుల్లిని చూసి "మీ అమ్మగార్ని హాస్పిటల్‌లోచేర్చి ఎన్నాళ్ళయింది?" అని అడిగాడు.

"రెండువారాలయిందండీ!" అన్నాడు బుల్లి.

"మరి నువ్వెళ్ళి చూసివచ్చావా?"

"లేదండి. నే వెళ్తే ఇక్కడ మా అక్కకి తోడెవ్వరూ వుండరండి. నిన్ననే మా పిన్ని వచ్చింది. ఈరోజు వెళ్దామనుకున్నాను కాని స్లిప్‌టెస్ట్ పరీక్ష వుంటంవలన వెళ్ళలేకపోయాను. రేపు వెళ్తానండి" అన్నాడు.

బస్సు ఆలస్యానికి విసిగిపోయి రోడ్డుదాటి పొలంగట్టుమీదికి పోయి కూచున్నారు ముగ్గురు టీచర్లు. మరో టీచర్ సిగరెట్ వెలిగించుకోవటానికి తాటిపాకల టీకొట్టు దగ్గరకి వెళ్ళి అక్కడ సమితి పరిపాలకులమీద రేగిన విమర్శలు వింటూ నుంచుండిపోయాడు. బుల్లబ్బాయిని విడవలేక మఫ్లర్‌చుట్టుకున్న పొడుగాటి టీచరూ, టీచర్‌ని విడిచి వెళ్ళలేక బుల్లబ్బాయీ రోడ్డుప్రక్కన మాటాడుకుంటూ నుంచున్నారు.

చలి ఎక్కువయినట్టుంది. ఒళ్ళంతా ముడుచుకుని నుంచున్నాడు బుల్లి. చేతులు పేంట్ జేబుల్లో పెట్టుకున్నాడు టీచర్. బస్ ఎంతకీ రావటంలేదు. తార్రోడ్డు ఉత్తర దక్షిణాలుగా తిన్నగా వుంది. అక్కడా అక్కడా ఎడ్లబళ్ళూ, అప్పుడప్పుడూ పార్సెల్ లారీలూ తప్పించి బస్ జాడేలేదు. రోడ్డుకి ఇరుప్రక్కలా దట్టంగా వున్న చెట్లు చీకటి మూటలని రోడ్డుమీద పోగులు పోగులుగా పడేస్తున్నాయి. పశ్చిమంగా వున్న వూరినించి వచ్చిన కంకర్రోడ్డు అక్కడ ఆగిపోయింది. దిక్కులేని నాలుగు టీకొట్టులు తూర్పుదిక్కుకి వున్నాయి. అన్నీ తాటాకులతో వేసినవే. ఆ టీకొట్లకీ తలుపులూ కిటికీలూ లాంటివి ఏవీలేవు. పై కప్పులుకూడా ఎత్తుగా లేవు. నేలకి చూరులు వాలాయి. లోపల మనుషులు ఎత్తుకు పోవటానికి వీల్లేని మట్టి అరుగులున్నాయి. ఒకటి రెండు టీడొక్కులూ, ఒక ఎత్తయిన జాతి అరుగూ వున్నాయి. ఆ టీకొట్లకి ఎదురుగా కిల్లీ బడ్డీలున్నాయి. అరటిగెలలూ, చుప్పలూ, చేగోడీలూ వేలాడుతున్నాయి బడ్డీలో. ఆ

ఆ టీకొట్ల వాళ్ళుకూడా వచ్చే ఈ రెండు బస్సులకోసంచూస్తున్నారు.

"మీ అమ్మగారికి ఇప్పుడెట్లా ఉంది?" అని అడుగుతున్నాడు ఆ టీచర్ బుల్లిని. కొంతసేపు మౌనంగా చుట్టూవున్నమనుషులని చూస్తూన్న అతని మనసు శూన్యంగా వుండిపోయింది.

పొలం గట్టుమీద కూచున్న టీచర్లు కేకేసి పిలుస్తున్నారు. అట్లా కుర్రాడితో నుంచుని మాట్లాడ్డం వారి కిష్టం లేదు. స్టూడెంట్సుతో చనువుగా వుండటం వలన టీచర్ అంటే భయం పోతుందని వాళ్ళ విమర్శ. కాని బుల్లితో మాటాడుతున్న ఆ టీచర్ పిల్లలతో కలిసిపోయి, వారితో ఆడుకోటానికీ, పాడుకోటానికీ యీ ఉద్యోగాన్ని ఎన్నుకున్నాడు. అతడి గదినిండా పిల్లలే! అమాయికంగా, కుతూహలంతో వాళ్ళ ప్రశ్నలు!

"మొన్నటివరకూ ఏమీ బాగా లేదు, చచ్చిపో—" అని తర్వాత పలకలేక "అనుకున్నారు" అన్నాడు. "మళ్ళీ నిన్నటికి కొంచెం నయమయిందంట. తెలివొచ్చిందట." అని మరి చెప్పలేకపోయాడు. తర్వాత చెప్పాల్సింది ఏమిటో బుల్లికి తెలీదు.

అమ్మ ఎంత బాధపడిపోతుందో వాడికి బాగా తెలుసు. అమ్మ మంచం ఎక్కిందంటే డాక్టర్‌ని పిలుచుకురావడం (వూర్లో చిన్న హాస్పిటల్ వుంది. అక్కడ మందు లుండవు. ఎల్. ఎమ్. పి. డాక్టర్ ఉన్నాడు), మందులకోసం పట్టణం వెళ్ళటం, ఒక్కోసారి బస్సులో, లేకపోతే సైకిల్‌మీద నాన్న పనిమీద ఎక్కడికన్నా వెళితే కొట్టుమీద కూచోవడం (బట్టల కొట్టుంది) - అన్నీ బుల్లబ్బాయి పనులే. వాడే ఆఇంట్లో పెద్దవాడూ, చిన్నవాడూ. బుల్లబ్బాయికి అక్క వుందిగాని ఆ అమ్మాయి పెళ్ళి అయిపోయి సుమారు వందమైళ్ళ దూరంలో వుంది. ఆ అమ్మాయికి కన్నవా రింటికి రావటానికి ఇష్టముండదు. వాళ్ళాయన పంపించడు. వాళ్ళ త్తగారికి వాళ్ళబ్బాయి బాధపడిపోయి మనసు పాడుచేసుకుని దిగులుపడిపోతాడని భయం. ఈసారి తల్లి ఆరోగ్యం గురించి గట్టిగా రాస్తే ఆమెని పంపించారు. ఆ అమ్మాయిని పంపిస్తూ పంపిస్తూ నాలుగుదినాలలో నేను వస్తానుగా

అన్నాడు వాళ్ళాయన. అంచేత వాళ్ళ అక్కయ్యకి ఇంటిపనులతోనే కాలం గడచిపోతోంది.

ఊరు చిన్న చిన్న దీపాల వెలుగుతోనూ, సత్యంబాబు గారి మేడతోనూ, చుట్టూ నల్లని చీకటి చెట్లతోనూ, సమీపంలో వున్న పొలాలలో గడ్డి కుప్పలతోనూ, పెద్ద చెరువుగట్టుమీది ఆలయం నల్లని నీడతోనూ సిల్హౌట్‌లా ఓ పెద్ద కాన్వాసుమీది చిత్రంలా కన బడుతోంది. శెట్టిగారి కిరాణాషాప్‌నుంచి వస్తున్న పెట్రోమాక్సు లైట్ కాంతి కనులు మిరుమిట్లు గొలుపుతోంది. ఆ వూరుకు దక్షిణంగా దేవాలయం దగ్గరవున్న రైస్‌మిల్లు గోల వినబడుతోంది. కొన్ని మైళ్ళ పశ్చిమంగా దూరంలో చీకటి కొండలు ఆ లేత వెన్నెల్లో కనబడుతున్నాయి.

ఇంకా బస్ రాలేదు.

మఫ్లర్ చుట్టుకున్న ఆ పొడుగాటి టీచర్ బుల్లబ్బాయినే చూస్తున్నాడు. వాడి కళ్ళు ఇంకా నిర్మలంగా, కడిగిన లేత నీలం కలువరేకుల్లా వున్నాయి. కొన్నిదినాలు తిండి సరిగ్గా తినక ఆరోగ్యం చెడగొట్టుకున్నట్టున్నాడు. వాడి చూపులు తన గుండెల్లోపలికి వెళ్ళి అక్కడ కన్నీరు కారుస్తున్నట్టున్నాయి.

బుల్లబ్బాయి కథ అంతా గుండెలో—ఆలోపల విశాల సముద్రంలో అంతవరకూ ప్రశాంతంగావున్న ఆ సముద్రంలో సుడిగాలి రేగి, తుఫాన్ వీచి తన తల్లిని చూడాలని వస్తున్న ఓ కొడుకు వున్న పడవని దెయ్యం ఊపినట్టుగా ఊపేస్తుంది. ఈ వయస్సులో వీడికి తల్లి లేకపోతే వీడేమయిపోతాడు? ఎవరు పిలచి ఈ ప్రపంచంలోని నిజాలు చెపుతారు? తన హృదయంలోని నిజాన్ని ఎవరి దగ్గర •వాడు చెప్పగలుగుతాడు? తల్లి లేదని లోకం వేలెత్తి చూపిస్తే ఏం వెతుకుతాడు? ఎక్కడ వెతుకుతాడు? తల్లిని పోగొట్టుకున్నాడని నిందిస్తే ఏం సమాధానం చెపుతాడు? అర్ధరాత్రి అమ్మ జ్ఞాపకమొచ్చి కేకేస్తే ఎవరు పలుకుతారు? ఎవ్వరూ పలకక్కపోతే వెక్కి వెక్కి ఏడిస్తే ఎవరు వోదారుస్తారు? ఎవరు తన చెంగుతో కన్నీరు తుడుస్తారు? మనసులోని ముక్కలు గాలులకి

హోరుపెట్టి ఊగుతున్నాయి. హృదయంలోని తేనెలో దెయ్యాలు మురికిపోసి కుమ్ముతున్నాయి. అతడి కనురెప్పలు కన్నీటిని పిండుతున్నాయి. పక్కకి తిరిగి కళ్లు తుడుచుకుని "వేరుసెనక్కాయలు తీసుకురా, వెళ్లు" అని పంపించేశాడు బుల్లిని.

బుల్లి టీచర్ ఇచ్చిన రూపాయి కాగితం అందుకుని, "ఎంతవి తేవాలండీ?" అని కళ్ళల్లోకి చూసి, ఆ కళ్ళు ఎర్రగా ఉండటం, ముక్కునించి నీరు కారడం చూసి, తెల్లబోయాడు.

"అర్థరూపాయివి తీసుకురా వెళ్లు," అని తోలాడు టీచర్.

బుల్లి వెళ్ళిపోయాడు.

బుల్లి నీటుగా, నిర్మలంగా, ఆరోగ్యంగా వుండేవాడు. అలాంటిది వాడిమీద ఈ బాధ్యతలు వచ్చిపడ్డాయి. తల దువ్వుకో లేదు. బట్టలు మాసిఉన్నాయి. పేదవాడిలా ఉన్నాడు. కనీసం గొంతు కూడా స్వచ్ఛంగా, ధైర్యంగా లేదు.

దూరాన దక్షిణ దిక్కునుంచి వస్తోన్న బస్ వెలుగు కనిపించింది. అదితీరానసమీపించేసరికి ఏలారీయోఅయిపోయి ఊరుకుంటుంది. దీపం ఆరిపోయినంత నిరాశగా వుంటోంది.

పొలం గట్టుమీద కూచొన్న టీచర్ల కాళ్ళు నొప్పులు పెట్టి, వస్తున్నది బస్సే అన్న ఆశతోవచ్చి. 'బస్సేనా గురూ?" అని ఎదుటి వాడికి తమకంటే ఎక్కువ తెలిసినట్టుగా కనుక్కుంటున్నారు.

బస్స్టాండులో సందడీ, సద్దూ ఎక్కువయింది.

బుల్లబ్బాయితోపాటు టీకొట్టుదగ్గరి టీచర్ వచ్చాడు. అందరూ మళ్ళీ ఒక్కదగ్గరికి చేరారు. ఆ నిమిషంలో వాళ్ళ చలి పోయింది. విసుగుపోయింది. బద్ధకం పోయింది.

ఆ రోజు ఆ టీచర్లకి వేతనాలు అందాయి. దగ్గరలో, అర గంట బస్సుదూరంలో చిన్న టౌను ఉంది. ఆ టౌనులో, ఆ టౌనుకి తగ్గట్టుగా, ఒక సినిమాహాలు ఉంది. ఆ హాలుకి శతదినోత్సవం చేసుకున్న ఓచిత్రం వచ్చింది. వెళ్ళి చూడాలని ఒకరిద్దరిలో కోరిక కలిగింది. పల్లె నిరాడంబరతతోనూ, చిన్నచిన్న అందాలతోనూ విసిగిపోయి టౌన్ వెళ్ళి రావాలని ఆ అయిదుగురికీ ఉద్దేశం కలిగింది.

వాళ్ళల్లో ముగ్గురు కుంపటి రాజేసుకుని వంట వండుకునే బ్రహ్మచారులు. వాళ్ళు 'రాత్రి వంట తప్పుతుంది, హోటల్లో తినొచ్చుకదా' అని సంబరపడ్డారు. దాంతో వచ్చి ఐదునించే బస్సుకోసం ఎదురు తెన్నులు చూస్తున్నారు. ఎంతకీ రాలేదు. చివరికి వచ్చింది—బస్సు అనుకుని ఆశపడ్డది—లారీ, పెట్రోల్ లారీ!

"గురూ—ఇంక సినిమా వొద్దూ పాడూ వొద్దు—పదండి చక్కా ఇంటికి. ఇంత తిని హాయిగా నిద్రపోక—ఈ చల్లో ఎవరు పడమన్నారు ఈ బాధ?" అన్నాడు ఒకాయన. ఆయన ఉత్సాహమంతా చల్లారిపోయింది. అంతేకాక బస్సుమీదా, సినిమామీదా కోపమొచ్చింది. మరో టీచర్ బస్సు ఆలస్యానికి ప్రభుత్వాన్ని తిట్టాడు. ఆయన మనుషులలో తప్పు కనిపించినా, కాలికి మేకు గుచ్చుకున్నా, చివరికి తనకి ఆకలేసినా ప్రభుత్వాన్ని తిడతాడు. అన్నిటికీ సంజాయిషీ ప్రభుత్వమే యివ్వాల్సి వుంటుంది అంటాడు. మరొకాయన తనకు వ్యక్తిత్వం లేనట్టుగా సందేహంలో పడ్డాడు. ఎటు బాగా గాలి వీస్తే అటే పోవాలని అతడి అభిప్రాయం.

మఫ్లర్ చుట్టుకున్న ఆపొడుగాటి టీచర్ 'చెరో పిడికెడు తీసుకోండి' అని అందరిమధ్యా పెట్టాడు—బుల్లబ్బాయి తెచ్చిన వేరుసెనక్కాయలని ఇష్టం లేనట్లుగా కొందరు, ఇష్టమున్నట్లుగా మరికొందరూ అందుకున్నారు.

"వెళ్దామనుకున్నాం, వెళ్ళాల్సిందే" అన్నాడు బ్రహ్మచారి టీచర్లలో హోటల్తిండిమీద మోజుపడిన ఒకాయన.

వాళ్ళు వెళ్ళి మళ్ళీ రావటానికి రాత్రి పదకొండున్నర గంటలకి పాసింజర్ వుంది. అక్కడ అది రెండు నిమిషాలు ఆగుతుంది. ఇట్లాంటి సమయాలలో ఆ రైలు ఎంతో సదుపాయం.

'బస్సు ఈ రోజొచ్చేట్టు లేదే' అని విసిగిపోయి, బాధపడి, నీరసించిపోయి 'మూర్తి (బస్‌డ్రైవర్) కి మరీ నెమ్మది. ప్రతివూరులోనూ వాడికి బంధువులే. బస్సెక్కిన ప్రతివాడూ వాడికి స్నేహితుడే. తీరిగ్గా వాళ్ళతో కబుర్లు చెప్పుకుని మరీ కదుల్తాడు." అని విసుక్కున్నారు.

కాళ్ళు నొప్పిపెట్టాయి. కొంతసేపు కూచుంటే బావుండునను కున్నారు. ఆ టీకొట్టులో కూచోటానికి చోటున్నట్టు లేదు. పైగా చుట్ట పొగకంపు. వంతెన గట్టుమీద కూచుందామా అంటే ఆ గ్రామ సేవికా, స్నేహితురాలూ కూచున్నారు. పోయి ఆ ప్రక్కనే కూచోవ టానికి తగుమాత్రం జాగా వుంది కాని, అక్కడ తమ పురుషత్వం తలొగ్గినట్లు అవుతుందేమో! మరీ సిగ్గూ యెగ్గూ లేని వెధవ లను కుంటారేమో! అంచేత సభ్యతకోసం నుంచోవడమే మంచిదను కున్నారు.

"మీ అయ్య రాలేదురా బుల్లీ?" అని ఓ టీచర్ అడిగాడు. ఆయన సంస్కారపరుడే కాని అది పల్లెటూరు. అక్కడికి వచ్చాక వాళ్ళభాష, వాళ్ళధోరణి అలవరచుకోవాల్సి వచ్చింది. అంచేత 'మీ నాయనగారు' అని వాడటానికి బదులు 'మీ అయ్య' అని వాడేడు.

"లేదండి. వారం దినాలయింది. రాలేదు. అంతకుముందు ఒక పూట వచ్చి మళ్ళీ అప్పుడే వెళ్ళిపోయాడు" అన్నాడు బుల్లి.

మఫ్లర్‌చుట్టుకున్న ఆ పొడుగాటి టీచర్‌కి బుల్లబ్బాయి తండ్రి భార్యకి చేస్తున్న సేవ అపురూపంగా కనబడింది. ఆ తండ్రి ఇక్కడ ఇల్లువదలి, ఆస్తివదలి, కొడుకు ఒక్కడే అయినా వాడిని వాడిగతికి వదలి, కూతురు అత్తవారింటినించి వస్తే ఆ విషయం కూడా గుర్తు లేక, తన స్వంత అవసరాలన్నీ మరచిపోయి— భార్యమీద మమతతో, ఆమెలేని వెలితి ఊహించలేక, ఆమె జీవితంలో ఇచ్చిన అదృష్టాలకి కృతజ్ఞతతో, ఆమె కన్నీళ్ళలో తనకి సంబంధించిన వేదనాభారం చూస్తూ, ఆమె అవసరావసరాలు కనిపెట్టి—

"డాక్టరు గట్టివాడే లెండి" అని వేరుసెనగపప్పు నోట్లో వేసు కుని క్షణం మాటాడలేక "మా రిలేటివ్ ఒకాయన చచ్చిపోతా డనుకున్నాం—అది కాదండీ—డాక్టరుమందు కాదు ముఖ్యం—ఆ చెయ్యి—ఆ చెయ్యి—అదిపడితే చాలు—అంతమంది డాక్టర్లున్నా- ఇతడికున్న డిమాండూ, ఇన్‌కమ్మూ—ఇతర్ల కేదీ—అసలు రేడి యమ్ ట్రీట్‌మెంటుకి కావలసినవి కూడా ఈ మధ్యనే జపాన్‌నుంచి తెప్పించాడండీ" అని డాక్టర్ని పొగిడి, బుల్లబ్బాయికి ఎంతో

ధైర్యాన్ని కలిగించి. వాడి గుండెలలో అల్లుకున్న సాలెగూళ్ళని తుడిచి—గుండెనిండా గాలి పీల్చుకునేట్టు చేశా డొకాయన.

మరో ఆయన "స్వామీ, అంతా మన ఖర్మ—వాడు చేసే దేమిటి? మనకి ఎంతరాసుంటే అంత. మన పూర్వజన్మ సుకృతం-మనఖర్మ బాగావుంటే అంతా మనప్రజ్ఞే." అని అస్పష్టంగా ఖండించి పారేశాడు. అదృష్టవశాత్తూ—ఈ వాదన బుల్లబ్బాయికి అర్థం కాలేదు. అందుచేత వాడు ఆశతో, ధైర్యంతో వున్నాడు. ఊళ్ళో ఒక అమ్మ తన తల్లి ఆరోగ్యంగురించి మాటాడుతూ "బతికి బట్టకట్ట గలిగితే ఆ పిల్లలపుణ్యమే" అని నిరాశ ప్రకటించింది. దాంతో వాడి గుండెల్లో సముద్రకల్లోలం రేగింది. వాడు మూగివాడు అయిపో యాడు. వాడిలోని ఉత్సాహం అంతా మాయమైపోయింది.

చలి తాళ్ళని బిగించుతోంది. కూచున్నవారు యింకొంచెం దగ్గరగా ముడుచుకు కూచుంటున్నారు. నిలుచుని మాటాడుకుంటున్న వారు ఒకరిచాటున ఒకరు నుంచుంటున్నారు. సిగరెట్లూ, బీడీలూ, చుట్టలూ తాగిన పొగలు ఎక్కువయ్యాయి. దూరాన ఒక ముసలమ్మ చుట్టవెలిగించి కాలినభాగం నోట్లోపెట్టుకుని అడ్డపొగ వదులుతూ కూచుంది. బయట నుంచోలేనివారు టీకొట్లమీది బెంచీలమీదికి వెళ్ళి పోతున్నారు. రోడ్డుపక్క బండిదగ్గర రెండు యెద్దులు నెమరువేసు కుంటున్నాయి.

ఆ అయిదుగురు టీచర్లమీదనే కాదు—అక్కడ బస్‌కోసం నిరీక్షిస్తున్న అందరిమీదా చీకటి నవ్వులాంటి వెన్నెల మాడిపోయిన లేత పసుపురంగు పులిమేసింది. అంచేత అక్కడగుమిగూడిన మను షుల నిజమైన రంగులు ఎవ్వరికీ కనబడడంలేదు.

ఒక వర్తకుడి కళ్ళల్లోని బంగారమూ, బేంకూ, స్త్రీ నగ్నశరీ రమూ అంచేతనే కనిపించడంలేదు. ఆ రంగు పులిమేసిన కారణం చేతనే ఒక యువకుడిలోని పడగలువిప్పిన ఆశ, కోరిక, స్వార్థం, యౌవనం బహాసభ్యతతో వ్యవహరిస్తున్నట్టు కనబడుతోంది. ఒక దిక్కులేని కూలివాడి అవురావురుమనే ఆకలి, ఎదురుగా కనబడు తున్న అరటిగెలమీద వాడి కళ్ళు ఎవరికీ అర్థం కావడంలేదు. ఆచీకటి

చిరునవ్వువల్ల నే, గ్రామసేవిక కళ్ళలో తన అందంమీదున్న అభిమానం, గర్వం ఇతర్లు పసికట్ట లేకపోతున్నారు. ఆ వెలుగునీడలే మఫ్లర్ చుట్టుకున్న ఆ పొడుగాటి టీచర్ కల్లోలిత ఆందోళిత హృదయాన్ని కప్పేశాయి. బుల్లబ్బాయిలోని కోటిగోదావరుల మాతృప్రేమ ఉరకలను ఆ రహస్యాంబరమే కప్పేసింది.

మళ్ళీ దక్షిణదిక్కునుంచి బస్ వెలుగు.

అది దగ్గరకొచ్చి ఏ లారీయో అయి నిరాశపరుస్తుందని మూలుగుతున్నారు. అయినా సద్దుపెరిగింది. కూలీలగోల హెచ్చింది. చిన్న చిన్న వస్తువులూ బస్తాలూ, మూటలు సర్దుకుంటున్నారు. బద్ధకంగా అందరూలేచి రోడ్డు ఓ పక్కకి చేరుతున్నారు.

ఇక్కడున్న ఇంతమందినీ ఈ బస్ ఎక్కించగలదా అన్న అనుమానంతో ఎవరికివారే తొందరపడి బస్సు ఎక్కిపోవా లనుకుంటున్నారు.

"గురూ ! ఇంతకీ సీటుదొరికేట్టుందా ?" అన్నాడు ఒకప్రయాణీకుడు—తనకుతెలిసిన ఇంకో ప్రయాణీకునితో.

"గురూ, మనకి సీటు ?" అని తోటివాళ్ళ ప్రశ్న విని అనుమానం ప్రకటించాడు ఓ టీచర్.

బస్ దగ్గరికి వచ్చినకొద్దీ సందడి హెచ్చుతోంది.

"బస్సే గురూ ! లోపల లయిట్లు కనపడుతున్నా యవిగో. బస్సే" అన్నాడు మరో టీచర్.

బస్సు పెట్రోలుకాల్చిన కంపుతోనూ, ధూళితోనూ, గోలతోనూ వచ్చి ఆగింది. బస్సు వెలుగులు అక్కడ చైతన్యాన్ని రగుల్కొల్పాయి. ప్రయాణీకులంతా బస్ ఎడంప్రక్క ఒకరిని ఒకరు తొక్కుకుంటూ, తోసుకుంటూ నుంచున్నారు. ఆ ఇంజన్ మోతలో క్లీనర్, కండక్టర్, డ్రైవర్‌లు పెద్ద పెద్ద కేకలేసి వాళ్ళ పరిభాషలో మాటాడుకుంటున్నారు. బస్సు అదృష్టవశాత్తు చాలావరకు ఖాళీగానే ఉంది. కాని అక్కడున్న ప్రయాణీకులందరికి చోటు దొరికేటట్టు లేదు.

తన పరిచయస్థులతో బస్‌డ్రైవర్ మూర్తి నమస్కారాలూ, పలకరింపులూ, నవ్వులూ ఆరంభమయ్యాయి.

"ఇంజనార్పమను" అని కండక్టర్ కేకేశాడు.

ఇంజనార్పేశాడు. దాంతో అక్కడ సగం అలజడి చల్లారి పోయింది. ఇప్పుడు వినిపించేవన్నీ మనుషుల గొంతులే.

పాతకాలపు బస్ అది.

ఫ్రంట్ సీటునుంచి ఇద్దరు అక్కడే దిగుతున్నారు. సత్యం బాబు తమ్ముడూ, ఆయన స్నేహితుడు స్టేషన్‌మాష్టరూ దిగారు. ఆ రెండు సీట్లలోకి ఇద్దరు టీచర్లు వెళ్ళారు. మఫ్లరు టీచరుతో పాటు మరోయిద్దరు సెకెండ్ సీట్లోకి వెళ్ళి కూచున్నారు.

బుల్లబ్బాయి డ్రైవరు సీటు దగ్గరికి వచ్చి బస్సెక్కి 'బావా, కారియరియ్' అని కేకేశాడు. మూర్తి వరసకి బుల్లబ్బాయికి బావ అవుతాడు. ఆ వూరే వాడిది. మొదట్లో క్లీనర్‌గా ఓ లారీలో పన్చేసి తర్వాత డ్రయివరుగా ఈ బస్సులోకి వచ్చాడు. వచ్చిన దగ్గర్నించీ ఈ బస్సులోనే వున్నాడు. ఇదే బస్సు. వారం పది దినాల్లో ఈబస్సు మారిపోయి కొత్త బస్సు వస్తుందట. చాలా పెద్దది.

డ్రైవర్ నల్లగా, బలంగా, పొట్టిగా, పెద్ద కళ్ళలాంటి గుండ్రనికళ్ళతో, పలచని సన్నటిపెదాలతో, గిరజాల జుత్తుతో రౌడీ లాగ కనబడతాడు.

బీడీతీసి అగ్గిపెట్టెవెతికి వెలిగించుకుంటున్నవాడల్లా 'బావా— కారియర్' అని కేక వినిపించేసరికి అటుతిరిగి 'ఒరేయ్ బుల్లీ' అన్నాడు బీడీ వెలిగించడం మానేసి.

"ఏం బావా?"

"కారియర్ ఇవేళ ఇవ్వలేదురా?" అన్నాడు.

"మరెలాగ?"

"రేపొచ్చేస్తారటరా. మీ నాన్న చెప్పమన్నాడు."

బుల్లికి ఆనందం ముద్దుపెట్టుకున్న పరవశత్వం కలిగింది.

మఫ్లర్ చుట్టుకున్న పొడుగాటి టీచర్ సెకెండ్ సీటులో కూచొని బుల్లబ్బాయిమాటలు ఆసక్తితో వింటున్నాడు.

"బావా, మరి నాన్నకి ఈరాత్రికి తిండో?" అన్నాడు గజాన్ని పట్టుకొని డ్రైవర్ సీటు దగ్గర నుంచున్న బుల్లి.

"ఫరవాలేదులే. హోటల్లో తింటాడు." అన్నాడు మూర్తి స్పష్టంగా.

మూర్తిపక్కనే ఫ్రంట్ సీటులో కూచున్న ఒకటీచర్‌కి ఉబలాటంగా వుంది. బస్సు ఈ రోజు ఇంత ఆలస్యంగా ఎందుకొచ్చిందో కనుక్కోవాలని.

"అయితే వెళ్ళిపోతాను బావా" అనేసి బుల్లబ్బాయి దిగిపోయాడు.

మళ్ళీ ఏమి అడగాలనుకున్నాడో గజం పట్టుకొని నుంచొని "ఈ నైటుబస్సుకి తిండిపట్టుకొని ఎత్తేనో?" అన్నాడు.

"వద్దంటే, ఎందుకురా. వాళ్ళు రే పొచ్చేస్తారుగదా. పైగా ఇంట్లో మీఅప్ప ఒక్కతే వుంటుందిగదా? తోడెవరుంటారు మరి?" అన్నాడు మూర్తి.

బావ కోప్పడ్డాడని దిగిపోబోయి, . ఇంట్లో అక్క ఒక్కతే వున్న కారణంచేతనే వెళ్ళవద్దంటున్నా డేమోనని "ఫరవాలేదు బావా, పిన్నివచ్చి పడుకుంటుంది తోడుగా" అన్నాడు.

"ఒరే బుల్లీ, నేన్చెప్పిందిన్రా."

"మూర్తి మరొక కారణమేదీ చెప్పలేదు.

ఎక్కువగా వాదించటం బావుండదని దిగిపోయాడు బుల్లబ్బాయి.

అంతలో మరో ఇద్దరొచ్చి అరటిగెలల లెక్కలేవో తేల్చుకుంటున్నారు. శ్రీకాకుళంనించి ఆ రోడ్డులోవున్న కిళ్ళీబడ్డీ లన్నిటికీ సుమారుగా మూర్తే అరటిగెలలు తెచ్చి యిస్తుంటాడు. ఆ డబ్బులు ఇవ్వడం మొదలయిన వ్యవహారాల్లో చిక్కుకున్నాడు.

డ్రైవర్‌పక్క కూచున్న టీచర్‌కి బస్సుఆలస్యానికి కారణం తెలుసుకోవాలని వుంది. మూర్తి బిజీగా వున్నాడు. అంచేత మెదలకుండా కూచున్నాడు. మూర్తి బీడీ వెలిగించి పొగ వదులుతున్నాడు.

"ఒచ్చిందా?" అనుకుంటూ మిల్లు డ్రైవర్ శాంతయ్య వచ్చాడు డ్రైవర్‌సీటు పక్కకి. ఇంకా అరటిగెలల వ్యవహారం తేల కుండానే వుంది.

"ఆఁ ఆఁ, వచ్చింది. కండక్టరుకి చెప్పి తీసుకో."

ఆ భాష వాళ్ళకే తెలుసు. ఆ వచ్చిం దనబడే వస్తువేదో, వచ్చిన వస్తువేదో. ఇతర్లకి తెలీదు. అక్కణ్ణించి మిల్లు డ్రైవర్ వెళ్ళిపోయాడు.

అందర్నీ కండక్టరు ఎక్కించేశాడు. బస్సు కిటకిటలాడు తోంది. మరి మంగళవారప్పూట తప్పదు ఆ రద్దీ! ఎవర్ని వద్దంటే వాళ్ళకేకోపం. అందరికీ వెళ్ళాలనివుంది. అందరికీ వాళ్ళ వాళ్ళ పను లున్నాయి. నుంచొనో, గజం పట్టుకుని వేలాడో పోవాలనివుంది, అదే చివరిబస్సు. ముప్ఫయిమందికోసమే నిర్ణయించబడినా ఆబస్సులో సుమారు డెబ్బయిమందికి పైగా వున్నారు. క్లీనర్ పైన యింకా మూటలు సర్దుతూనే వున్నాడు. గొడవ వుండనే వుందిగాని, కొంత తగ్గింది.

"ర్ ర్ ర్ ర్ యిట్" అన్నాడు కండక్టర్ చివరికి. డ్రయి వర్ చెవిదగ్గర బెల్ మ్రోగింది దాంతోపాటు.

ఇంజన్ స్టార్టుచేశాడు. స్టీరింగ్‌మీద చేతులు పడ్డాయి. దృష్టి రోడ్డుమీదికి పోయింది. బస్సు కదిలింది.

అంతలో హెడ్మాష్టరుగారి పేపరు ఇవ్వడం మరచిపోయిన సంగతి గుర్తుకొచ్చింది. కిల్లీబడ్డీవానిని పిలిచాడు డ్రైవరు. వాడు వచ్చి తీసుకుపోయాడు.

"సినిమాకి అందించగలరా?" అని అడిగారెవరో.

"పావుగంటలో వెళ్ళిపోమా బాబూ?" అన్నాడు డ్రైవరు అతి ధైర్యంగా.

"అయితే మీ పుణ్యమనుకుంటాం."

"అన్నట్టు ఇంత ఆలస్యమేం?" అని ఇంకొకప్రశ్న.

"ఆ గేటుదగ్గర జనతా వస్తున్నాదని అరగంట ఆగిపోయింది బాబూ. దానికితోడు రోడ్డునిండా ధాన్యంబళ్ళు. ఎంత హారన్‌కొట్టినా

కదలవు. జాగ్రత్తగా రాకపోతే చూడండీ, మన పీకమీదికొస్తుంది. ఆ తరవాత ఆసుపత్రిదగ్గర ఐదునిమిషాలు ఆపాల్సొచ్చింది. మా అప్ప చచ్చిపోయింది. నిన్నటికి తెలివొచ్చింది, ఇంక ఫరవాలేదనుకున్నాం. కాని ఈరోజు సాయంత్రం నాలుగున్నరకి ఆహంస ఎగిరిపోయింది" అన్నాడు దీనమైన గొంతుతో.

మూర్తిపక్క కూచున్న టీచర్‌కి గుండె ఆగినంత పనయింది. అంతవరకూ బుల్లబ్బాయిగురించీ, వాడి తల్లిగురించీ అసలు ఆలోచించనేలేదు. కాని, సీట్‌లో కూచున్నాక డ్రైవర్ చెప్పిన మాటలు విన్నాడు. రేపు తిరిగి వచ్చేస్తున్నా రన్నాడు, బాగానే వుందన్నాడు. కారియర్ అందుకే తేలేదన్నాడు. బుల్లబ్బాయి బావ మాటలు నమ్మి ఎంతో ఆనందంతో వెళ్ళిపోయాడు. రేపు అమ్మని చూస్తాననే ఆశ వాడిలో వుంటుంది. ఈ రాత్రంతా తీయనికలలతో నిద్రపోతాడు. తెల్లారేసరికి తల్లి మంచుపల్లకీలో కన్పిస్తే—

"ఆ కుర్రాడితో మరి అట్లాచెప్పారెందుకు?"

"ఇంకేమని చెప్పగలం మేష్టారూ?....చిన్నవాడు."

గేరు మార్చాడు డ్రైవర్.

డ్రైవర్ పక్కన కూచున్న టీచర్ వెనుక సీట్‌వేపు తిరిగి, మఫ్లర్‌చుట్టుకున్న ఆ పొడుగాటి టీచర్‌తోనూ, ఇతర టీచర్లతోనూ "బుల్లబ్బాయి తల్లి పోయిందంటండీ" అన్నాడు.

బస్ రోడ్డు మలుపు తిరిగింది. ఎడ్ల బండి ఎదురయి మూర్తి సడన్‌బ్రేక్ వేశాడు. బస్సులో కిటకిటలాడుతున్న మనుషులంతా ఒకరినొకరు గుద్దుకొని, ఒకరినొకరు తిట్టుకున్నారు. రుసరుస చూసుకున్నారు.

మళ్ళీ బస్ కదిలింది.

మీ అమ్మ నిన్ను చూడాలని రమ్మని కబురుపెట్టింది. ఇవ్వాళ స్లిప్ఇస్తువుండి వెళ్ళలేకపోయావు. రేపు వెళ్తా వనుకున్నావు. ఆ చూడాల్సిందేదో నువ్వు వెళ్ళకుండానే చూస్తావు—అనుకున్నాడు ఆ పొడుగాటి టీచర్.

"ఇంక నీకు ఈప్రపంచంలో ఎవ్వరూ సత్యం చెప్పరు బుల్లీ.

నువ్వు సత్యానికి దూరమయిపోతావు. పిరికివాడి వై పోతావు. నువ్వూ సత్యం చెప్పలేవు. నీకూ ఆ బలం పోతుంది" అని బాధపడి కన్నీరు కార్చి—

"అందుకే నేను పిరికివాడినై పోయాను" అని నిట్టూర్చాడు ఆ టీచర్.

*   *   *

బుల్లబ్బాయి ఒంటరిగా చెరువుగట్టుమీంచి పోయి వూరు సమీపించేసరికి ఎవరో గుండెకొట్టుకుని ఏడుస్తున్న ఏడుపు వినిపించింది. అది—ఆ ఏడుస్తున్నది—తన అక్క. సత్యం ఆమెకి తనకంటే ముందుగా కనిపించరాని విధంగా కనిపించి—

అక్క గుండెలుపగిలే ఏడుపు నిజంచెప్పినప్పుడు—బావంటే కోపం వచ్చింది. ఆ బస్సుఅంటే కోపం వచ్చింది. డాక్టరంటే కోపం వచ్చింది. నాన్న అంటే కోపం వచ్చింది. స్లిప్‌టెస్ట్లుఅంటే కోపం వచ్చింది. టీచర్లు అంటే కోపం వచ్చింది. చదువు అంటే కోపం వచ్చింది. అక్క చుట్టూ గుమిగూడిన జనమంటే కోపం వచ్చింది. తనమీద తనకి కోపం వచ్చింది. ఆ కోపంతో, ఆ బాధతో, ఆ హింసతో తన్ను వంచించినందుకు, దూరంగా వుంచినందుకు, తననుండి సత్యం దాచినందుకు తనలో మానవత్వం చచ్చిపోయినందుకు బావురుమని ఏడ్చాడు బుల్లబ్బాయి.